సాక్షి
జోగులాంబ గద్వాల

మంగళవారం । 31 । డిసెంబర్ । 2024



కబడ్డీ చాంపియన్ రంగారెడ్డి

రాష్ట్రస్థాయి సీఎం కప్ కబడ్డీ చాంపియన్‌గా రంగారెడ్డి నిలిచింది.

వివరాలు 8లో ▸



నేటి నుంచి నెట్‌బాల్ టోర్నీ

పాలమూరులో మంగళవారం నుంచి రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ టోర్నీ నిర్వహించనున్నారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.6 /14.6

వాతావరణం

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది. ఉదయం, రాత్రివేళ చలి తీవ్రత ఉంటుంది. మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

జోగులాంబ సన్నిధిలో ఐజీ, డీఐజీ



అలంపూర్: అష్టాదశ శక్తిపీఠాల్లో ఐదో శక్తిపీఠమైన అలంపూర్ పుణ్య క్షేత్రాన్ని ఐజీ సత్యనారాయణ, డీఐజీ చౌహాన్ సోమవారం దర్శించున్నారు. ఆలయ అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. జోగుళాంబ అమ్మవారికి, బాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఈఓ పురేందర్‌కుమార్ తీర్థప్రసాదాలు అందజేసి శేషవస్త్రాలతో వారిని సత్కరించారు.

ఆదిశిలా క్షేత్రంలో అమావాస్య ప్రత్యేక పూజలు



మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సమయంలో రాలేని భక్తులు సోమవారం అమావాస్యను పురస్కరించుకుని ఆలయానికి పెద్దసంఖ్యలో హాజరై స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అలాగే భక్తులు కొత్త, పాత వాహనాలకు అర్చకులతో ప్రత్యేక పూజలు చేయించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. అలాగే భక్తమార్కండేయ హరికథను ఆలయ ప్రాంగణంలో ఆంజనేయులు భాగవతార్ భక్తులకు వినిపించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాద రావు, ఈఓ సత్యచంద్రారెడ్డి, అర్చకులు రమేషాచారి, మధుసూధనాచారి, రవిచారి, ధీరేంద్రదాసు, నాగరాజు శర్మ, చంద్రశేఖర్ రావు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించండి



అలంపూర్: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాజీ ఎంపీ మందా జగన్నాథంకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క అన్నారు. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో ఎంపీ చికిత్స పొందుతుండగా.. సోమవారం మంత్రులతోపాటు ఎమ్మెల్యే వివేక్ పరామర్శించారు. అక్కడి వైద్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి పరామర్శించిన వారిలో ఉన్నారు.

'పాలమూరు' ఎత్తిపోతలపై కుట్రలు

సాక్షి, నాగర్‌కర్నూల్: పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్ నుంచి డిండి ప్రాజెక్ట్ ద్వారా దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాలకు నీరందించేందుకు ప్రభుత్వం తెచ్చిన జీవో 159ను రద్దు చేయాలని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాసినట్లు తెలిపారు. సోమవారం జిల్లాకేంద్రంలోని ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. నల్లగొండ జిల్లాలోని దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాలకు సాగునీరు అందించేందుకు ఇప్పటికే ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్ట్ ఉందని చెప్పారు. ప్రభుత్వం ప్రతిపాదించినట్టుగా పాలమూరు ప్రాజెక్ట్‌లోని ఏదుల రిజర్వాయర్ నుంచి నీటిని తరలిస్తే పాలమూరు జిల్లాలోని కర్వెన, ఉదండాపూర్ రిజర్వాయర్లకు నీరు అందని పరిస్థితి తలెత్తనుందని చెప్పారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్‌ను పూర్తిచేసి త్వరగా ఇక్కడి రిజర్వాయర్లను నీటితో నింపాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నేతలు స్వార్థ రాజకీయాల కోసం ఇక్కడి నుంచి నీటిని తరలిస్తే తమ పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. పాలమూరు ప్రజల సాగునీటి ప్రయోజనాలు కాపాడేందుకు ఎలాంటి త్యాగాలకైనా సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

➪ గద్వాల పట్టణానికి చెందిన ఓ వైద్యురాలి మొబైల్ వాట్సాప్ నంబర్‌కు ఈ ఏడాది జులై 19న అపరిచితులు ఫోన్ చేసి నగదు సాయం చేయాలని కోరారు. ఆర్మీ క్యాంప్‌లో గర్భిణికి ఆరోగ్య సంరక్షణ సేవ నగదు సాయం కోసం వీడియో కాల్ చేశామని నమ్మబలికారు. మీ మొబైల్ నంబర్‌కు ఓటీపీ వచ్చిందనగా ఆమె నంబర్ చెప్పింది. వెంటనే ఆమె వ్యక్తిగత ఖాతాలో రూ.71,476 నగదు మాయమైంది. మోసపోయినట్లు గ్రహించిన ఆమె పట్టణ పోలీస్‌లను ఆశ్రయించగా.. కేసు నమోదు చేశారు.

➪ ఆన్‌లైన్ ట్రేడింగ్ మార్కెట్‌లో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తాయని అపరిచిత వ్యక్తి ఒకరు గద్వాలకు చెందిన ఓ ప్రభుత్వ బ్యాంక్ ఉద్యోగికి ఇన్‌స్టాగ్రామ్ ద్వారా నమ్మబలికారు. నమ్మిన సదరు ఉద్యోగి పెట్టుబడి పెట్టాడు. లాభాలు రావడంతో ట్రేడింగ్ కంపెనీ నుంచి నగదు డ్రా చేసుకునేందుకు ప్రయత్నం చేశాడు. సదరు కంపెనీ నిర్వాహకులు పన్నుల రూపంలో చెల్లించేందుకు కొంత నగదును జమ చేయాల్సిందిగా పేర్కొన్నారు. దీంతో అతడు మరికొంత నగదును డిపాజిట్ చేశాడు. కంపెనీ నుంచి ఎలాంటి సమాచారం రాకపోవడంతో రూ.1.50 లక్షలు మోసపోయినట్లు గ్రహించి పట్టణ పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు.

➪ ఈ ఏడాది జూన్ 28న గద్వాల జిల్లాకేంద్రానికి చెందిన ఎంఈఓ స్థాయి ప్రభుత్వ విద్యాధికారికి ఓ అపరిచిత వ్యక్తి వాట్సాప్ వీడియో కాల్ చేసి మాట్లాడాడు. తప్పుడు ధ్రువపత్రాలతో లోన్ తీసుకున్నావని నమ్మబలికారు. మీపై కేసు నమోదు చేశామని.. వెంటనే మేము చెప్పిన ప్రాంతానికి రావాలని ఆదేశించారు. కేసు నుంచి మినహాయింపు కావాలంటే మేము చెప్పిన ఖాతాలోకి నగదును ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని ఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో ఎలాగైనా **కేసు నుంచి బయటపడేందుకు ఆ అధికారి రూ.1.80 లక్షలను ఆన్‌లైన్‌లో వారి ఖాతాలో జమ చేశాడు. ఆ తర్వాత ఇలా జరిగిందని ఆయన తన స్నేహితులకు వివరించగా.. ఇది ఫ్రాడ్ అని వారు చెప్పారు. దీంతో సదరు వ్యక్తి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.**

సైబర్ మాయ..!

ఉమ్మడి పాలమూరును బెంబేలెత్తిస్తున్న సైబర్ మోసాలు

- గత సంవత్సరంతో పోలిస్తే 15.42 శాతం పెరిగిన నేరాలు
- ఈ ఏడాది అమాయకుల నుంచి రూ.10 కోట్ల మేర దోపిడీ
- అన్ని జిల్లాల్లోనూ అంతంత మాత్రంగానే స్వాధీనం
- 'గోల్డెన్ అవర్'లోనే సొమ్ము రికవరీకి అవకాశం



దైనందిన జీవితంలో డిజిటలైజేషన్ వినియోగం పెరగడంతో ప్రజలు ఆన్‌లైన్, మొబైల్ సేవలపై ఆధారపడుతున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని సైబర్ మోసగాళ్లు రెచ్చిపోతున్నారు. రకరకాల పేర్లు, లింక్‌లతో మభ్యపెట్టి అమాయకులను నిలువు దోపిడీ చేస్తున్నారు. సైబర్ కేటుగాళ్ల వలలో చిక్కుకున్న ఎందరో డబ్బులతో పాటు ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు. ఆన్‌లైన్ మోసానికి గురైన వికారాబాద్ జిల్లాకు చెందిన ఓ రైతు ఇటీవల బలవన్మరణానికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉమ్మడి పాలమూరు జిల్లాను సైబర్ మాయ కమ్మేసిన తీరు.. గత ఏడాదితో పోలిస్తే పెరిగిన సైబర్ మోసాల కేసుల శాతం.. ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

జిల్లాల వారీగా ఇలా..

❒ మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ ఏడాదిలో సైబర్ నేరగాళ్లు సుమారు రూ.4 కోట్ల వరకు కొల్లగొట్టినట్లు అంచనా. ఇందులో కేవలం రూ.55,000 రికవరీ అయ్యాయి.

❒ నాగర్‌కర్నూల్ జిల్లాలో సైబర్ మోసగాళ్లు అమాయకుల నుంచి రూ.57,96,325 దోచుకోగా.. పోలీసులు వారి నుంచి రూ. 10,08,278 రికవరీ చేశారు.

❒ గద్వాల జిల్లాలో సైబర్ కేటుగాళ్ల బారిన పడిన అమాయకులు రూ.3,83,50,299 కోల్పోగా.. పోలీసులు 10,59,051 రికవరీ చేశారు. ఇవి పోనూ పలువురు బాధితులకు సంబంధించిన రూ.55,29,181 పలు బ్యాంక్‌లలో ఫ్రీజింగ్‌లో ఉన్నాయి.


❒ నారాయణపేట జిల్లాలో రూ.13,13,000కు గాను ఇప్పటివరకు పోలీసులు రూ.1,63,000 మాత్రమే రికవరీ చేయగలిగారు.

❒ వనపర్తి జిల్లాలో రూ.1.50 కోట్లకు గాను ఇప్పటివరకు కేవలం రూ.5.30 లక్షలు రికవరీ అయినట్లు పోలీస్ రికార్డులు చెబుతున్నాయి.

ఈ ఏడాది 15.42 శాతం పెరిగిన కేసులు..

ఉమ్మడి పాలమూరు జిల్లాలో గతేడాదిలో 1,766 సైబర్ కేసులు నమోదు కాగా.. ఈ సంవత్సరం 2,724 నమోదయ్యాయి. ఈ లెక్కన 15.42 శాతం మేర సైబర్ నేరాల శాతం పెరిగినట్లు తెలుస్తోంది. గత ఏడాదితో పోలిస్తే ఒక్క నారాయణపేట జిల్లాలోనే సైబర్ నేరాల సంఖ్య తగ్గగా.. మిగతా అన్ని జిల్లాల్లోనూ పెరిగాయి. నమోదైన కేసులు కొన్ని మాత్రమే కాగా.. తమ పేర్లు బయటకు వస్తాయని, ఇతరత్రా కారణాలతో ఫిర్యాదు చేయని వారే అధిక సంఖ్యలో ఉంటారని పోలీసులు అంచనా వేస్తున్నారు.

జిల్లాల వారీగా నమోదైన సైబర్ నేరాలు ఇలా..



కొల్లగొట్టింది రూ.10 కోట్లు..
రికవరీ రూ.28.15 లక్షలే..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సైబర్ కేటుగాళ్లు ఈ సంవత్సరంలో అమాయకుల నుంచి రూ.10.05 కోట్లు కొల్లగొట్టారు. ఇందులో 28.15 లక్షలు మాత్రమే రికవరీ కాగా..పోలీసులు న్యాయప్రక్రియ పూర్తి చేసి ఆయా బాధిత వ్యక్తులకు అందజేశారు. బ్యాంకుల్లో ఫ్రీజ్ అయినవి సుమారు రూ.2 కోట్ల వరకు ఉండొచ్చని అంచనా. అంటే సైబర్ కేటుగాళ్లు మిగతా సొమ్మును మింగేసినట్లు అర్థమవుతోంది.

ఇలా మోసపోతున్నారు..

జిల్లాలో నమోదైన సైబర్‌క్రైం కేసుల్లో అధికంగా ఫేక్ యాప్‌లలో అధిక లాభాలకు ఆశపడి పెట్టుబడి పెట్టి నష్టపోయిన వారే ఉన్నారు. ఏపీకే యాప్ లింక్‌లపై టచ్ చేసి ఖాతాల్లోని నగదును పోగొట్టుకున్న ఘటనలు కూడా ఉన్నాయి. బ్యాంకుల్లో రుణం ఇప్పిస్తాం.. కొంత డబ్బులు డిపాజిట్ చేయాలని, క్రెడిట్ కార్డు బిల్స్ క్లియర్ చేస్తామని చెప్పి ఆన్‌లైన్‌లో లింక్‌లు పంపించి.. ఫోన్ కాల్స్, బ్యాంక్ ఏటీఎంల పేరుతో నగదు అపహరించినట్లు కేసులు నమోదయ్యాయి. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి మోసపోతున్న వారిలో విద్యాధికులే ఉండడం గమనార్హం. అత్యాశే ఇందుకు కారణమని పోలీసులు చెబుతున్నారు.

గోల్డెన్ అవర్ లోపు ఫిర్యాదు చేస్తే మేలు..

సొమ్మును కాజేసే క్రమంలో సైబర్ నేరస్తులు తన లేదా తన వారికి సంబంధించిన ఖాతాలకు నగదును బదిలీ చేస్తారు. అక్కడి నుంచి మరిన్ని ఖాతాలకు మళ్లించి.. అనంతరం ఏటీఎంల ద్వారా డ్రా చేస్తారు. ఈ మేరకు సైబర్ మోసానికి గురైన సొమ్ము పోగొట్టుకున్న తొలిగంట (గోల్డెన్ అవర్) లోపు ఫిర్యాదు చేస్తే.. ఆ సొమ్మును వెంటనే రికవరీ చేసే అవకాశం ఎక్కువగా ఉంటుంది. బాధితుడి ఖాతా నుంచి నగదు (తొలిసారి) ఎక్కడికి బదిలీ అయిందో గుర్తించి.. అక్కడి నుంచి మరో ఖాతాకు బదిలీ కాకుండా నిలిపివేయవచ్చు. ఆ సొమ్మును రాబట్టుకుని న్యాయప్రక్రియ ద్వారా తిరిగి బాధితులకు అప్పగించొచ్చు.

– వెంకటేశ్వర్లు, డీఎస్పీ, మహబూబ్‌నగర్

1930 లేదా డయల్ 100కు ఫిర్యాదు చేయాలి..

సైబర్ నేరాలపై ప్రజలకు క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. సైబర్ మోసానికి గురైనట్లు తెలిసిన వెంటనే 1930 లేదా డయల్ 100కు ఫోన్‌చేస్తే నిందితుల ఖాతాలను స్తంభింపజేయవచ్చు. తద్వారా కోల్పోయిన సొమ్ము రికవరీ చేసేందుకు అవకాశం ఉంటుంది. సైబర్ నేరగాళ్లు ఇటీవల కాలంలో కొత్త పంథాలో నేరాలకు పాల్పడుతున్నారు. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్లు, మెసేజ్‌లకు స్పందించొద్దు.

– రామేశ్వర్, ఏఎస్పీ, నాగర్‌కర్నూల్

అవగాహన కల్పిస్తున్నా..

సైబర్ నేరాలపై పోలీస్ శాఖ ప్రతి సంవత్సరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈ ఏడాది సైతం క్షేత్రస్థాయిలో వ్యాపారులతో పాటు మున్సిపాలిటీల పరిధిలోని కాలనీల్లో, మండలాల పరిధిలో గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో 483, నాగర్‌కర్నూల్ జిల్లాలో 1,080, నారాయణపేటలో 328, గద్వాల, వనపర్తిలో 400 వరకు అవగాహన సదస్సులు నిర్వహించారు. అయినా సైబర్ మోసాలకు అడ్డుకట్ట పడకపోవడం ఆందోళన రేపుతోంది.

రూ.9.24 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

గద్వాల క్రైం: ఓ వ్యాపారి బ్యాంకు ఖాతా, క్రెడిట్ కార్డు నుంచి రూ.9.24 లక్షలను సైబర్ నేరగాళ్లు కాజేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాలిలా.. గద్వాల మండలం సంగాల గ్రామానికి చెందిన వ్యాపారి చెట్టుకింది అయ్యపురెడ్డి వ్యక్తిగత బ్యాంకు ఖాతా (యూనియన్ బ్యాంకు)నుంచి, అలాగే క్రెడిట్ కార్డు నుంచి గుర్తు తెలియని వ్యక్తులు ఈ నెల 17, 20వ తేదీల్లో మొత్తం రూ. 9.24లక్షలు కాజేశారు. అయితే నగదు డ్రా అయినట్లు వ్యక్తిగత మెయిల్‌కు సమాచారం రావడంతో బ్యాంకు అధికారుల నుంచి లావాదేవీల వివరాలు తెలుకున్న క్రమంలో సైబర్ నేరగాళ్లు అయ్యపురెడ్డి వ్యక్తిగత ఖాతా నుంచి, అలాగే క్రెడిట్ కార్డు చివరి నాలుగు అంకెలు మార్పులు చేసి లావాదేవీలు జరిపినట్లు అధికారులు నివేదికలు అందజేశారన్నారు. దీంతో సైబర్ నేరగాళ్లు తన క్రెడిట్ కార్డు, వ్యక్తిగత ఖాతాలోంచి నగదు కాజేసినట్లు గుర్తించి ఈ నెల 28వ తేదిన గద్వాల రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మోసాలకు పాల్పడిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుని న్యాయం అందించాల్సిందిగా బాధితుడు తెలిపారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ

గద్వాలటౌన్: అభిషేక ప్రియుడైన హరుడు.. అలంకార ప్రియుడైన హరిసుతుడు మణికంఠుని సేవలో పట్టణ వాసులు పులకించారు. స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం పడిపూజ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన అయ్యప్ప స్వాములు, భక్తులతో ఆ ప్రాంతం కిటకిటలాడింది. మణికంఠుడికి మంగళకర పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. అరటి బోదెలు, వివిధ రకాల పుష్పాలతో దేవతా మూర్తులు కొలువుదీరిన అయ్యప్ప పడిని శోభాయమానంగా తీర్చిదిద్దారు. ప్రారంభంతో విఘ్నాధిపతి వినాయకుడు, చివరన సిరులనొసగే మహాలక్ష్మి అమ్మవార్ల మధ్య హరిహరసుతుడు కొలువుదీరాడు. న్యాయవాది గంగాధర్, డాక్టర్ అభినేష్ ఆధ్వర్యంలోని కార్యక్రమానికి గురుస్వామి రాములు పూజకు అర్చకత్వం వహించారు. మొదటి నుంచి చివరి వరకు సాగిన పడిపూజ మహోత్సవం వైభవంగా సాగింది. భక్తులు ఆలపించిన అయ్యప్ప గీతాలు ఆధ్యాత్మిక చింతను కలిగించాయి. అయ్యప్ప పడిపూజకు కర్నూల్ ఎంపీ నాగరాజు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత, మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్‌తో పాటు పలువురు పట్టణ ప్రముఖులు హాజరై పూజలు నిర్వహించారు.



అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న కర్నూల్ ఎంపీ నాగరాజు, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత

సాంకేతికతపై రైతులకు అవగాహన పెంచాలి



డీలర్లకు సర్టిఫికెట్ అందజేస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

- పంట సాగులో ఎరువుల వాడకాన్ని తగ్గించాలి
- కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల: వ్యవసాయంలో వచ్చిన నూతన సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు అవగాహన పెంచాలని.. డిప్లొమా కోర్సులలో నేర్చుకున్న పలు అంశాలను రైతులకు ఉపయోగపడే విధంగా కృషి చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ సర్వీసెస్ ఫర్ ఇన్‌పుట్ డీలర్స్ దేశీ 2022–23 ధ్రువపత్రాల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు విక్రయించే డీలర్లకు వాటి అవసరం వినియోగంపై శాస్త్రీయమైన అవగాహన కల్పించాలనే లక్ష్యంతో 48వారాల పాటు డిప్లొమా కోర్సును కేంద్ర వ్యవసాయ శాఖ ద్వారా అందించడం జరిగిందన్నారు. విత్తనాల డీలర్లు రైతులతో మంచి సంబంధాలు ఏర్పరుచుకుని వారికి కొత్త వ్యవసాయ పద్ధతులు, ఎరువు మందులు, టెక్నాలజీ వినియోగం, పంటలకు సంక్రమించే రోగాలపై అవగాహన కల్పించాలని సూచించారు. దీనివల్ల ఉత్తమమైన ఫలితాలు వస్తాయన్నారు. రైతులకు పంట విధీకరణ, ప్రత్యేకంగా ఆయిల్ ఫామ్ సాగు, అధిక దిగుబడులు, ఆదాయం ఇచ్చే ఇతర పంటలపై అవగాహన కల్పించాలన్నారు. డిప్లొమా కోర్సు పూర్తి చేసుకున్న 38మంది డీలర్లకు సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. కార్యక్రమంలో డీఏఓ సక్రియానాయక్, ఉద్యావన శాఖ అధికారి అక్బర్ బాషా, ఏఏస్‌వో సంగీతలక్ష్మీ, రమేష్ బాబు, టెక్నికల్ ఏవో జనార్దన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

'ప్రజావాణి'కి 65 ఫిర్యాదులు

వివిధ రకాల సమస్యలపై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీవోసీ సమావేశం హాలులో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి 65 ఫిర్యాదులు స్వీకరించారు. వీటిని ఆయా శాఖలకు చెందిన అధికారులకు పంపినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగ్‌రావు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

వర్గీకరణపై వినతులు అందించాలి

ఎస్సీ ఉప కులాలపై అధ్యయనం చేసేందుకు రాష్ట్ర హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ షమీమ్ అక్తర్ 31వ తేదీన మంగళవారం ఉమ్మడి మహబూబ్‌నగర్ విచ్చేసి ఎస్సీ ఉప కులాల వర్గీకరణపై అధ్యయనం చేయనున్నారని కలెక్టర్ తెలిపారు. ఎస్సీ కుల సంఘాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న కులసంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు అందరూ మహబూబ్‌నగర్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని కులవర్గీకరణ అధ్యయనంపై తమ విజ్ఞాపనలు రాతపూర్వకంగా సమర్పించాలన్నారు.

నయా సాల్.. ఫుల్‌జోష్

- 31న అర్ధరాత్రి 12 వరకు మద్యం విక్రయాలకు ప్రభుత్వం అనుమతి
- బార్ అండ్ రెస్టారెంట్లు, ఈవెంట్లకు సైతం..
- మందుబాబులకు ఆబ్కారీ శాఖ నూతన సంవత్సర 'కానుక'



గద్వాలటౌన్/గద్వాల క్రైం: పాత సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ కొత్త సంవత్సరం వచ్చిందంటే.. వాణిజ్య వ్యాపార సంస్థలు కొనుగోళ్లను మెరుగుపర్చుకోవడానికి తమ వినియోగదారులకు ఆశలు, అవకాశాలను కల్పించడం సహజం. విచిత్రంగా ప్రభుత్వ ఎక్సైజ్‌శాఖ కూడా ఇదే విధానాన్ని అనుసరిస్తోంది. తన ఆదాయాన్ని మెరుగుపర్చుకోవడంలో భాగంగా ఆబ్కారీశాఖ నూతన సంవత్సర ప్రారంభ సమయంలో మద్యం ప్రియులకు బంపర్ బొనాంజా ప్రకటించింది. డిసెంబర్ 31న అర్ధరాత్రి 12 గంటల వరకు మద్యం విక్రయ వేళలను పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నయాసాల్ వేడుకలపై ఆంక్షలుంటాయన్న ప్రచారంతో నిరుత్సాహంగా ఉన్న యువతలో సర్కార్ జారీ చేసిన ఉత్తర్వులు కొత్త ఉత్సాహాన్ని నింపాయి. సాధారణ రోజుల్లో మద్యం దుకాణాలు రాత్రి 10గంటల వరకు అనుమతి ఇస్తారు. అయితే నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మద్యం దుకాణాల మూసివేత సమయాన్ని అర్ధరాత్రి వరకు పొడగించంపై ప్రధానంగా మహిళల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది.

వేడుకలు శాంతియుతంగా జరుపుకోవాలి : ఎస్పీ

నూతన సంవత్సర వేడుకల విషయంలో జిల్లా ప్రజలు పోలీసుశాఖ ఆదేశాలను పాటించాల్సిందిగా ఎస్పీ శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31వ తేది సాయంత్రం 6గంటల నుంచి జిల్లా ప్రజలు, యువత నిర్వహించుకునే వేడుకలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని తెలిపారు. పోలీసుశాఖ అనుమతి లేకుండా ఆర్కెస్ట్రా, డీజేలు, ర్యాలీలు నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు ఉంటాయని, అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలోని డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు ఉంటాయని, బహిరంగ ప్రదేశాలలో మద్యంతాగితే ఉపేక్షించేది లేదని తెలిపారు.

శాంతిభద్రతలపై నిరంతరం అప్రమత్తత



సమావేశంలో మాట్లాడుతున్న ఐజీ కె రమేష్‌నాయుడు

గద్వాల క్రైం: శాంతిభద్రతలపై సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని.. ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం వహించకుండా తగు చర్యలు తీసుకోవాలని ఐజీ కె.రమేష్ నాయుడు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. జిల్లాలో నమోదైన కేసుల వివరాలను ఎస్పీ శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. రెండు రాష్ట్రాల సరిహద్దుల వద్ద నిత్యం నిఘా ఉంచాలని, చట్ట వ్యతిరేక దందాలను ఎంత మాత్రం ఉపేక్షించవద్దని, ప్రతి స్టేషన్‌లో రికార్డులు అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలన్నారు. సైబర్, ట్రాఫిక్, ఐటీ, ఎస్‌బి, టాస్క్‌ఫోర్స్, నిఘా తదితర విభాగాల పని తీరుపై నివేదికలను పరిశీలించారు. పోలీసులు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని, నేరస్తులపై కఠినంగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో డీఎస్పీ సత్యానారయణ, సీఐలు టాటా బాబు, శ్రీను, నాగేశ్వరెడ్డి తదితరులు ఉన్నారు.

గిరిజనులు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న రాములు నాయక్

గద్వాలటౌన్: గిరిజనులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా రాణించాలని.. బంజారాల అభ్యున్నతికి కలిసికట్టుగా ముందడుగు వేయాలని ఆలిండియా బంజార సేవా సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో వారు పాల్గొని మాట్లాడారు. బంజారా జాతిని చీకటి నుంచి వెలుగులోకి తీసుకొచ్చిన గొప్ప విప్లవ చైతన్య మూర్తి సంత్ సేవాలాల్ అని కొనియాడారు. సేవాలాల్ మహారాజ్ తన బోధనలతో బంజారా జాతి పురోగమించడానికి ఎంతో కృషి చేశారని అనానరు. లంబాడీ ప్రజలపై రోజురోజుకు దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యపరంగా, రాజకీయంగా చైతన్యం సాధించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కిసాన్‌సింగ్, రాందాస్‌నాయక్, శేఖర్‌నాయక్, తాన్యనాయక్, శివనాయక్, రాము, హనుమంతు, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

శివకుమార్ (ఫైల్)

తెలకపల్లి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నరేష్ వివరాల ప్రకారం.. మండలంలోని బండపల్లికి చెందిన గన్నోజు శివకుమార్(27) ఆదివారం తన బైక్‌పై తెలకపల్లికి వచ్చి సాయంత్రం 6 గంటల సమయంలో తిరిగి ఊరికి వెళ్తుండగా, దాసుపల్లి డంపింగ్ యార్డు వద్ద బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో శివకుమార్ తలకు, భుజానికి తీవ్ర గాయాలయ్యాయి. రాత్రి 9 గంటల సమయంలో నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. అతని అన్న నరేష్ సోమవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్‌పై నుంచి పడి ఇద్దరు యువకుల దుర్మరణం

శ్రీనాథ్ (ఫైల్)

భాను (ఫైల్)

ఊర్కొండ: బైక్‌పై నుంచి పడి ఇద్దరు యువకులు మృతిచెందిన ఘటన ఊర్కొండ మండలంలోని జగ్బుర్ల–కోదాడ రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ వీరబాబు వివరాల మేరకు.. కల్వకుర్తి పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన శ్రీనాథ్ (20), బలరాంనగర్ కాలనీకి చెందిన భాను (21) ద్విచక్ర వాహనంపై జగ్బుర్ల వైపు నుంచి కల్వకుర్తికి వెళ్తుండగా.. ఊర్కొండపేట సమీపంలోని కాటన్ మిల్లు వద్ద అదుపుతప్పి కిందపడ్డారు. ప్రమాదంలో వారిద్దరికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి మార్చురీకి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పాముకాటుతో రైతు..

నాగపురి శివ(ఫైల్)

పెద్దకొత్తపల్లి: పాముకాటు వల్ల రైతు మృతి చెందిన సంఘటన సోమవారం పెద్దకారు పాములలో చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు నాగపురి శివ(28) వ్యవసాయ పొలంలో మినుము పంటకు నీటితడి వేసేందుకు వెళ్లాడు. స్ప్రింకర్ల పైపులు మార్చుతుండగా పాముకాటు వేసింది. చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఆయనకు భార్య హారిక, కూతురు, కుమారుడు ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

హన్వాడ: జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం మండలంలోని శేకపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బత్తుల వెంకటయ్య(56) మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ప్రమాదానికి గురై మానసికంగా బాధపడుతున్నాడు. ఆదివారం రాత్రికి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి ముందున్న టేకు చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బత్తుల చెన్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

అడ్డాకుల: మండలంలోని తిమ్మాయిపల్లితండాకు చెందిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఏఎస్‌ఐ మనోహర్ తెలిపారు. వివరాలు.. తిమ్మాయిపల్లితండాకు చెందిన పాత్లావత్ గోపాల్(53) కొన్నేళ్ల నుంచి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తిచెంది ఆదివారం ఇంటివద్ద గడ్డిమందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్సనిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ సోమవారం మృతి చెందాడని ఏఎస్‌ఐ తెలిపారు. మృతుడి భార్య పాత్లావత్ చంద్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు.

కబడ్డీ చాంపియన్ రంగారెడ్డి


ఫైనల్లో తలపడుతున్న వనపర్తి-రంగారెడ్డి జిల్లా క్రీడాకారులు

మహిళలు, పురుషుల విభాగాల్లో విజయం

- ముగిసిన రాష్ట్రస్థాయి సీఎం కప్ కబడ్డీ టోర్నీ
- పురుషుల రన్నరప్‌గా వనపర్తి, మూడో స్థానంలో నల్లగొండ
- మహిళల రన్నరప్‌గా నల్లగొండ, మూడో స్థానంలో హైదరాబాద్

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సీఎం కప్ పురుషుల, మహిళల కబడ్డీ చాంపియన్‌షిప్ సోమవారం ఉత్సాహంగా ముగిసింది. టోర్నీలో పురుషుల, మహిళల విభాగాల్లో రంగారెడ్డి జట్లు చాంపియన్‌షిప్‌లను కైవసం చేసుకున్నారు. పురుషుల రన్నరప్‌గా వనపర్తి, మహిళల రన్నరప్‌గా నల్లగొండ జట్లు, పురుషుల విభాగంలో మూడోస్థానంలో నల్లగొండ, మహిళల్లో హైదరాబాద్ జట్లు నిలిచాయి.

■ పురుషుల విభాగం రంగారెడ్డి, వనపర్తి జట్ల మధ్య మ్యాచ్ ఉత్కంఠంగా సాగింది. మొదటి అర్ధ బాగంలో 18–16 పాయింట్ల ఆధిక్యంలో ఉన్న వనపర్తి జట్టు రెండో అర్ధభాగంలో తడబడింది. చివరగా ఆట ముగిసే సమయానికి రంగారెడ్డి 34–31 పాయింట్ల తేడాతో వనపర్తిపై విజయం సాధించి విజేతగా నిలిచింది. మహిళల ఫైనల్లో రంగారెడ్డి 57–39 పాయింట్ల తేడాతో నల్లగొండపై నెగ్గింది. పురుషుల మూడోస్థానం మ్యాచ్‌లో నల్లగొండ జట్టు 48–33 పాయింట్ల తేడాతో నారాయణపేటపై, మహిళల మూడోస్థానం మ్యాచ్‌లో హైదరాబాద్ 34–31 పాయింట్ల తేడాతో గద్వాల విజయం సాధించాయి. అంతకుముందు జరిగిన పురుషుల విభాగం సెమీఫైనల్ మ్యాచ్‌ల్లో రంగారెడ్డి 46–30 పాయింట్ల తేడాతో నల్లగొండ జట్టుపై, వనపర్తి 44–35 తేడాతో నారాయణపేట జట్టుపై గెలిచాయి. మహిళల విభాగం సెమీఫైనల్ మ్యాచ్‌ల్లో నల్లగొండ 53–27 పాయింట్ల తేడాతో హైదరాబాద్‌పై, రంగారెడ్డి 38–29 పాయింట్ల తేడాతో గద్వాలపై గెలుపొందాయి.

■ ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, రాష్ట్ర క్రీడల వ్యవహారాల సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి సోమవారం పోటీలను తిలకించారు. పురుషుల, మహిళల ఫైనల్ మ్యాచ్‌ను టాస్‌వేసి ప్రారంభించారు. అనంతరం క్రీడాజట్లకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎన్పీ వెంకటేశ్, కురుమూర్తిగౌడ్, ఉపాధ్యక్షులు మక్సూద్ బిన్ అహ్మద్ జాకీర్, జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్, జిల్లా వాలీబాల్ సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి చెన్న వీరయ్య, జిల్లా కబడ్డీ సంఘం కార్యనిర్వాహక కార్యదర్శులు పాపారాయుడు, బాల్‌రాజు, వృత్తినైపుణ్య శిక్షణ కేంద్రం ఇన్‌చార్జీ ఎస్.విజయ్‌కుమార్, డీఎస్‌ఏ సీనియర్ అసిస్టెంట్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు. టోర్నీలో గెలుపొందిన జట్లకు త్వరలో హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో ట్రోఫీలు, మెడల్స్ అందజేస్తారని డీవైఎస్‌ఓ తెలిపారు.


పురుషుల విభాగంలో రన్నరప్‌గా నిలిచిన వనపర్తి జట్టు


మహిళల విభాగంలో విజేతగా నిలిచిన రంగారెడ్డి జట్టు

రికార్డుల అప్‌డేట్ ముఖ్యం

- ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో 16,833 కేసులు నమోదు
- రూ.11.10కోట్లు కాజేసిన దొంగలు
- రూ.3.42కోట్లు రికవరీ
- మల్టీజోన్- 2 ఐజీ సత్యనారాయణ


డీఐజీ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఐజీ సత్యనారాయణ

మహబూబ్‌నగర్ క్రైం: డీఐజీ కార్యాలయంలో రికార్డులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవడం చాలా ముఖ్యమని మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలో ఉన్న జోగుళాంబ జోన్-7 డీఐజీ కార్యాలయాన్ని సోమవారం వార్షిక తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులు, కేసు ఫైల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రికార్డుల నిర్వహణలో సరైన విధానాలు పాటించడం ద్వారా పారదర్శకత పెరుగుతోందన్నారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న ఐదు జిల్లా పోలీస్ శాఖలో 2024లో 16,833 కేసులు నమోదైనట్లు తెలిపారు. వీటిలో 3784 కేసులు ఇంకా విచారణలో ఉన్నాయన్నారు. ఈ ఏడాది మహబూబ్‌నగర్‌లో 5896, నాగర్‌కర్నూల్‌లో 3770, వనపర్తిలో 3538, గద్వాలలో 2419, నారాయణపేటలో 2210 నమోదైనట్లు ఐజీ వెల్లడించారు. ప్రధానంగా హత్యలు 84, హత్యాయత్నాలు 78, దొంగతనాలు 1608 జరిగినట్లు తెలిపారు. ఆస్తినష్టం రూ.11.10కోట్లు అయితే దీంట్లో రూ.3.42కోట్లు రికవరీ చేశామన్నారు. ఉమ్మడి జిల్లాలో దొంగతనాల్లో కోల్పోయిన సొమ్ము రికవరీలో 30.82శాతం అయ్యిందన్నారు. కిడ్నాప్‌లు 202, మహిళలపై అత్యాచారాలు 315, చీటింగ్ 779, రోడ్డు ప్రమాదాలు 1559 నమోదైనట్లు ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో పని చేసే పోలీస్ అధికారులు, సిబ్బంది విధుల పట్ల నిబద్ధత చూపాలని ఆదేశించారు. ముఖ్యమైన రికార్డులను డిజిటలైజేషన్ చేసి భద్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో డీఐజీ ఎల్.ఎస్ చౌహాన్, ఎస్పీ డి.జానకి పాల్గొన్నారు.

జాతీయస్థాయి రగ్బీ పోటీలకు 8మంది ఉమ్మడి జిల్లా క్రీడాకారులు


రాష్ట్ర రగ్బీ జట్లతో నిరంజన్‌రావు తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: బిహార్ రాష్ట్రం పాట్నాలో వచ్చే నెల 1, 2 తేదీల్లో జరిగే 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 జాతీయస్థాయి రగ్బీ పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. తెలంగాణ బాలబాలికల జట్లలో 8 మంది క్రీడాకారులు చోటు దక్కించుకున్నారు. బాలుర జట్టులో కె.శివ (జెడ్పీహెచ్‌ఎస్, గార్లపహాడ్), శివకుమార్ (జెడ్పీహెచ్‌ఎస్, మద్దూర్), తిరుమలేష్ (గద్వాల), బాలికల జట్టులో రాధిక (జెడ్పీహెచ్‌ఎస్, గొండ్యాల), మీనాక్షి (బాలానగర్, గురుకుల), ఉర్కుందమ్మ (గద్వాల), సుచిత్ర (సజ్జఖాన్‌పేట) రాష్ట్ర బాలికల జట్టులో ఉన్నారు. తెలంగాణ జట్లు సోమవారం పాట్నాకు తరలివెళ్లాయి. క్రీడాకారులను జిల్లా రగ్బీ సంఘం ప్రధాన కార్యదర్శి నిరంజన్‌రావు, ఉపాధ్యక్షులు ఉమాపతిరెడ్డి, కోశాధికారి బాల్‌రాజు అభినందించారు. జాతీయస్థాయి టోర్నీలో ప్రతిభచాటి రాష్ట్రానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న పాలమూరు యూనివర్సిటీ వీసీ శ్రీనివాస్

- పీయూలో విద్యార్థుల ఆందోళన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ(పీయూ)లోని హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు అడ్మినిస్ట్రేషన్ భవనం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈమేరకు వీసీ శ్రీనివాస్‌తో పాటు రిజిస్ట్రార్ చెన్నప్ప విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నరేషతేజ మాట్లాడారు. హాస్టళ్లలో మెరుగైన భోజనం అందించాలని, శానిటేషన్ పాటించాలని కోరారు. పీయూలో ఉన్న అన్ని సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ కోర్సులుగా మార్చాలని, రెగ్యులర్ అధ్యాపకులను నియమించాలని డిమాండ్ చేశారు. పీయూకు మంజూరైన లా, ఇంజినీరింగ్ కళాశాలల్లో హాస్టళ్లను వెంటనే నిర్మించాలన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం పీయూ ముఖద్వారం వద్ద రిక్వెస్ట్ బస్టాప్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. పరీక్షలు నిర్వహించి నెలలు గడుస్తున్నా ఫలితాలు వెల్లడించడం లేదన్నారు. ఈమేరకు 30 రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని వీసీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణకుమార్, వేణుగోపాల్, నాగేష్, రవితేజ, భాను, వినోద్, రవి పాల్గొన్నారు.

నేటి నుంచి సీఎం కప్ రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలు

- మూడు రోజుల పాటు పురుషుల, మహిళల చాంపియన్‌షిప్
- 26 జిల్లాల నుంచి 630 మంది క్రీడాకారులు, 250 మంది అఫీషియల్స్ రాక
- నాలుగు కోర్టుల్లో మ్యాచ్‌ల నిర్వహణ

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో మంగళవారం నుంచి జనవరి 2వరకు సీఎం కప్ రాష్ట్రస్థాయి నెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నారు. ఇప్పటికే రాష్ట్రస్థాయి సీఎం కప్ కబడ్డీ పోటీలను విజయవంతంగా నిర్వహించగా, మరో రాష్ట్రస్థాయి పోటీలకు మెయిన్ స్టేడియం వేదికైంది.

630 మంది క్రీడాకారుల రాక

రాష్ట్రస్థాయి సీఎం కప్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి 630 మంది, మహిళలు, అఫీషియల్స్ 250 మంది(కోచ్, మేనేజర్లు, అంపైర్స్) రానున్నారు. మెయిన్ స్టేడియంలో నాలుగు కోర్టుల్లో లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరగనున్నాయి. పురుష క్రీడాకారులకు ఎంవీఎస్ ఇండోర్ స్టేడియం, అంబేద్కర్ కళాభవన్, మెయిన్ స్టేడియంలోని స్విమ్మింగ్‌పూల్‌లోని పై అంతస్తు, మహిళలకు ఎన్టీఆర్ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలికల కళాశాల, బీపీహెచ్‌ఎస్, మాడ్రన్ స్కూల్‌లో మహిళలకు వసతి, మెయిన్ స్టేడియంలో క్రీడాకారులకు భోజన వసతి ఏర్పాటు చేశారు. నేటి ఉదయం నెట్‌బాల్ మ్యాచ్‌లు జరగనున్నాయి.


మెయిన్ స్టేడియంలో నెట్‌బాల్ టోర్నీ ఏర్పాట్లు

జిల్లాల జట్లను 8 పూల్‌లుగా విభజన,,

26 జిల్లాల జట్లను 8 పూల్‌లుగా విభజించారు.

మహిళల విభాగం..

పూల్-ఏలో మహబూబ్‌నగర్, జనగాం, జగిత్యాల, మంచిర్యాల, బీలో ఖమ్మం, నిజామాబాద్, నాగర్‌కర్నూల్, నారాయణపేట, సీలో భద్రాద్రి కొత్తగూడెం, ఆదిలాబాద్, కామారెడ్డి, డీలో హైదరాబాద్, పెద్దపల్లి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, ఈలో నిర్మల్, జోగుళాంబ గద్వాల, కొమురంభీం ఆసిఫాబాద్, ఎఫ్‌లో రంగారెడ్డి, మహబూబాబాద్, మెదక్, జీలో వరంగల్, రాజన్న సిరిసిల్ల, నల్గొండ, హెచ్‌లో కరీంనగర్, హన్మకొండ, వనపర్తి ఉన్నాయి.

పురుషుల విభాగం..

పూల్-ఏలో మహబూబ్‌నగర్, రంగారెడ్డి, జగిత్యాల, హన్మకొండ, బీలో నారాయణపేట, మంచిర్యాల, భద్రాద్రి కొత్తగూడెం, రాజన్న సిరిసిల్ల, సీలో మహబూబాబాద్, వనపర్తి, నల్గొండ, డీలో హైదరాబాద్, గద్వాల, కరీంనగర్, ఈలో ఖమ్మం, ఆదిలాబాద్, పెద్దపల్లి, ఎఫ్‌లో కామారెడ్డి, మేడ్చల్, మెదక్, జీలో కొమురం భీం ఆసిఫాబాద్, జనగాం, నిజామాబాద్, హెచ్‌లో వరంగల్, నాగర్‌కర్నూల్, నిర్మల్ ఉన్నాయి.

క్రీడాకారులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

రాష్ట్రస్థాయి సీఎం కప్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్‌కు వచ్చే క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశాం. రాష్ట్రస్థాయి సీఎం కప్ కబడ్డీ టోర్నీని అందరి సహకారంతో విజయవంతంగా నిర్వహించాం. ఈ టోర్నీని కూడా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తాం.

– ఎస్.శ్రీనివాస్, జిల్లా యువజన, క్రీడల అధికారి, మహబూబ్‌నగర్

టోర్నీ విజయవంతానికి సహకారం అందిస్తాం

జిల్లాకు రాష్ట్రస్థాయి సీఎం కప్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్ కేటాయించినందుకు చాలా సంతోషంగా ఉంది. టోర్నీ విజయవంతం కోసం నెట్‌బాల్ సంఘం తరఫున పూర్తి సహకారం అందిస్తాం.

– ఖాజాఖాన్, కార్యదర్శి, నెట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ

సహజ వనరుల దోపిడీని వ్యతిరేకించాలి

- ప్రజాఫ్రంట్ మహాసభల్లో వక్తలు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్

పాలమూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీ ప్రాంతాల్లోని సహజ ఖనిజ నిక్షేపాలను వెలికితీసి విదేశీ సామ్రాజ్యవాదులకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయని ప్రొ. గడ్డం లక్ష్మణ్, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి ఆరోపించారు. సోమవారం జిల్లాకేంద్రంలోని టీఎన్జీఓ భవనంలో జరిగిన తెలంగాణ ప్రజాఫ్రంట్ ఉమ్మడి జిల్లా మహాసభలకు వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. సహజ వనరుల దోపిడీకి వ్యతిరేకంగా సంఘటితంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. దోపిడీని అడ్డుకుంటున్న స్థానిక పీడిత ప్రజలపై పాలకవర్గాలు పోలీసులతో అక్రమ కేసులు బనాయిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వాలు ఈ విధానాలు మార్చుకోకపోతే ప్రజావెల్లువలో కొట్టుకుపోతారని హెచ్చరించారు. రాష్ట్రంలో ఏరికోరి తెచ్చుకున్న పాలకులు తెలంగాణ కోసం బలిదానం చేసిన త్యాగధనులను మరిచి తమ స్వలాభం కోసం, తమకు కావాల్సిన పెట్టుబడిదారుల కోసం పని చేస్తున్నారని విమర్శించారు. పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉమ్మడి జిల్లాలో గుట్టల విధ్వంసం జరుగుతోందన్నారు. ఈ విధ్వంసంతో స్థానికులు సహజ వనరులు కోల్పోతారని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు మన్యంకొండ, శ్రీదేవి, ఇన్నయ్య, శంకర ప్రభాకర్, అంబయ్య, భరత్, భూషణ్, వామన్‌కుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పంప్‌మోడ్ పద్ధతిలో 11,579 క్యూసెక్కులు తరలింపు

దోమలపెంట: భూగర్భ కేంద్రంలో పంప్‌మోడ్ పద్ధతిలో 24 గంటల వ్యవధిలో శ్రీశైలం ఆనకట్ట దిగువన సాగర్ జలాశయం నుంచి ఆనకట్ట ఎగువన శ్రీశైలం జలాశయంలోకి 11,579 క్యూసెక్కుల నీటిని (ఎత్తిపోతల) తరలించారు. పోతిరెడ్డిపాడు ద్వారా 1,500 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,710, ముచ్చుమర్రి నుంచి కేసీ కెనాల్‌కు 490, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. సోమవారం శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం 862.0 అడుగుల వద్ద 112.2100 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

జూరాలకు స్వల్ప ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లోలు స్వల్పంగా వస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. సోమవారం సాయంత్రం వరకు ప్రాజెక్టుకు 1,400 క్యూసెక్కులు ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆవిరి రూపంలో 89 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 200 క్యూసెక్కులు, ప్రాజెక్టు నుంచి మొత్తం 289 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 8.087 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

పత్తి తూకంలో గోల్‌మాల్

- పోలీసులకు ఫిర్యాదు చేసిన రైతు


దళారి రాసిచ్చిన పట్టి


గోపాల్‌పేటలో వేబ్రిడ్జి తూకం చీటి

బిజినేపల్లి: రైతులు కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి దళారులను ఆశ్రయిస్తే వారు ఎలక్ట్రానిక్ కాంటాల్లో రిమోట్లను ఏర్పాటు చేసి భారీగా మోసాలకు పాల్పడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గోపాల్‌పేటకు చెందిన రైతు ధన్వాడ నాగరాజు ఆదివారం ఉదయం వేబ్రిడ్జిపై పత్తి తూకం చేయగా 11.65 క్వింటాళ్లుగా చూపింది. అదే పత్తిని బిజినేపల్లిలోని రాముగౌడ్ అనే దళారి వద్ద విక్రయించేందుకు తీసుకొచ్చారు. ధర రూ.6,900 నిర్ణయించి తూకం వేసి 8.11 క్వింటాళ్లుగా చూపారు. దీంతో కంగుతిన్న రైతు దుకాణం ఎదుట తోటి రైతులతో కలిసి ఆందోళనకు దిగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని ఎస్‌ఐ శ్రీనివాసులు వద్ద ప్రస్తావించగా.. రైతు నుంచి ఫిర్యాదు తీసుకొని క్షేత్రస్థాయిలో విచారణ చేపడుతున్నామని.. మోసం చేసినట్లు తేలితే కేసు నమోదు చేస్తామని వివరించారు.

ఆటో డ్రైవర్లతో కలిసి మోసాలు?

బిజినేపల్లిలో దళారులు దుకాణాల వద్ద ఎలక్ట్రానిక్ కాంటాలు ఏర్పాటు చేసుకొని మోసాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వీరు కొందరు ఆటో డ్రైవర్లతో కుమ్మక్కై ఒక్కో సంచికి రూ.200 వరకు కిరాయి కూడా దళారే చెల్లిస్తున్నట్లు సమాచారం. ఆటో డ్రైవర్లు, దళారులు కలిసి చేసే మోసాలకు రైతులు బలవుతున్నారు. ఒకవేళ మోసం బయటపడితే నాయకులు రంగంలోకి దిగి సెటిల్‌మెంట్ చేస్తున్నారని తెలుస్తోంది. దళారుల మామూళ్ల మత్తులో సంబంధిత అధికారులు అటువైపు కూడా చూడటం లేదని సమాచారం.

యూనియన్ బ్యాంకులో చోరీకి విఫలయత్నం


డాగ్ స్క్వాడ్‌తో ఎస్‌ఐ సురేష్


చోరీ గురించి సీఐతో వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

అమరచింత: వనపర్తి జిల్లా అమరచింత యూనియన్ బ్యాంకులో గుర్తుతెలియని దుండగులు చోరీకి యత్నించడం కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. శుక్రవారం సాయంత్రం విధులను పూర్తి చేసుకున్న సిబ్బంది బ్యాంక్‌కు తాళంవేసి వెళ్లారు. శని, ఆదివారం రెండు రోజులపాటు సెలవు ఉండటంతో బ్యాంకు పనిచేయలేదు. ఇదే అదునుగా భావించిన గుర్తుతెలియని దుండగులు బ్యాంకు వెనకి భాగంలోని కిటికీని తొలగించి లోపలికి ప్రవేశించారు. బ్యాంకులోని సీసీ కెమెరాలను ధ్వంసం చేసి.. లాకర్‌ను బద్దలు కొట్టేందుకు విఫలయత్నం చేశారు. లాకర్ ఎంతకు తెరుచుకోకపోవడంతో ఓ కంప్యూటర్ మానిటర్‌తో పాటు సీసీ ఫుటేజీలు రికార్డయ్యే పరికరాన్ని తీసుకొని అక్కడి నుంచి పరారయ్యారు. సోమవారం విధులకు హాజరైన బ్యాంకు సిబ్బంది చోరీ ఘటనను గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ శివకుమార్, క్రైం బ్రాంచ్ సీఐ రవిపాల్, ఎస్‌ఐ నరేష్ బ్యాంక్‌కు చేరుకొని వివరాలు సేకరించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో విచారణ చేపట్టారు. బ్యాంకు మేనేజర్ శివశంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు డీఎస్పీ వెల్లడించారు.